క్లుప్తంగా

వైభవంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



శావల్యాపురం: మండలంలోని వేల్పూరులోని భూసమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. టీటీడీ వేద పాఠశాల వేద పండితుల ఇనిమెట్ల అనంతచార్యులు, రుత్విక్ శిష్య బృందం సారథ్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు బీవీ మారుతీ రామచార్యులు మాట్లాడుతూ కల్యాణం, హోమం సాయంత్రం గరుడ ఉత్సవం ఊరేగింపు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు.

వక్తృత్వ పోటీల్లో గణపవరం విద్యార్థుల ప్రతిభ



నాదెండ్ల: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం జిల్లా కేంద్రమైన నరసరావుపేట శంకరభారతిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలలనుంచి 17మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. స్థిరమైన జీవనశైలికి కేవలం మార్పు– అనే అంశంపై జరిగిన పోటీలో గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ఇరువురు విద్యార్థులు పాల్గొనగా, ఎం.లక్ష్మీపూర్ణిమ తృతీయ స్థానం, కె.హిమఆదిత్య నాలుగో స్థానంలో నిలిచారు. మొదటి ఐదుస్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ఆర్డీవో మధులత ప్రశంసాపత్రాలు, మెమొంటోలు, నగదు ప్రోత్సాహకాలు అందించారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన ఎస్.బాజిబాబు, ప్రతిభ చాటిన విద్యార్థులను హెచ్ఎం కృష్ణానాయక్ అభినందించారు.

స్వచ్ఛ ఆంధ్రలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి



నరసరావుపేట రూరల్: స్వచ్ఛ ఆంధ్రలో ప్రతి ఒక్కరి భాగస్వాములు కావాలని ఎంపీడీవో టీవీ కృష్ణకుమారి తెలిపారు. మండలంలోని ఇక్కుర్రులో శనివారం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళీ, ఎంపీడీవో కృష్ణకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ప్లాస్టిక్ వాడకం వలన నష్టాలను గ్రామస్తులకు వివరించారు. తడిచెత్త, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఎం ఎంఆర్‌సీ అయ్యపరెడ్డి, గ్రామ నాయకులు కొల్లి వెంకటేశ్వర్లు, రమేష్ పాల్గొన్నారు.

కృష్ణవేణిలో 49 మందికి ఉద్యోగాలు



నరసరావుపేట ఈస్ట్: కృష్ణవేణి డిగ్రీ కళాశాలకు చెందిన 49 మంది విద్యార్థులు ఫస్ట్ సోర్స్ కంపెనీ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన క్యాంపస్ డ్రైవ్‌లో కంపెనీ హెచ్ఆర్ అనిల్ పర్యవేక్షణలో విద్యార్థులకు గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్ఆర్ రౌండ్స్ నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ నాతాని మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు ఉపాధి, ఉద్యోగ కల్పన లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎం.బాలకోటేశ్వరరావు, జి.శివన్నారాయణ పాల్గొన్నారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

చిలకలూరిపేటటౌన్: మద్యం మత్తులో వ్యక్తిపై దాడిచేసిన సంఘటనపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మూడు సినిమాహాళ్లలో మేనేజర్‌గా పని చేస్తున్న చిలక రజినీకాంత్ శుక్రవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ట్రావెల్స్ వద్ద కారును తీసుకుని నరసరావుపేట సెంటర్ వైపు వస్తుండగా రోడ్డుపై అడ్డుగా ఉన్న వారిని తొలగమంటూ గద్దించడంతో మద్యం తాగి ఉన్న కొందరు యువకులు అతనిపై దాడి చేశారు. దీనిపై రజినీకాంత్ ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్లాస్టిక్ నిషేధానికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలి

కమిషనర్ జస్వంతరావు



ర్యాలీ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

నరసరావుపేట: సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధంలో పట్టణ ప్రజలు, వ్యాపారులు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు కోరారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం సింగిల్‌యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలంటూ మున్సిపల్ కార్యాలయం నుంచి మల్లమ్మసెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ప్రారంభించి కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ కె.మధులత, రోటరీ, లయన్స్‌క్లబ్, చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ప్రతినిధులు, మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా విభాగ స్వయం సహాయక సంఘాల మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలకలూరిపేట: ప్లాస్టిక్ రహిత సమాజంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చెప్పారు. పట్టణంలోని కళామందిర్ సెంటర్‌లో పురపాలక సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలిథిన్ కవర్ల వంటి ప్లాస్టిక్‌తో పర్యావరణానికి హాని జరగడంతో పాటు, పారిశుద్ధ్యానికి విఘాతం ఏర్పడుతుందని వివరించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో పాటు చెత్తను రోడ్లపై వేయరాదని సూచించారు. ప్లాస్టిక్ వ్యర్థాల నియంత్రణలో మున్సిపల్, పోలీసు అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. సూర్యఘర్ పథకంలో భాగంగా ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేసుకొనే దిశగా ప్రజలు ఆలోచన చేయాలన్నారు.

పురపాలక సంఘ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈఈ షేక్ అబ్దుల్ రహీం పాల్గొన్నారు.


ర్యాలీలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, చైర్మన్ షేక్ రఫాని

కాసు మహేష్‌రెడ్డిని పరామర్శించిన డాక్టర్ గోపిరెడ్డి


గాయాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: రెండు రోజులు క్రితం తలకు గాయమై ప్రకాష్‌నగర్‌లోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న గురజాల మాజీ శాసనసభ్యులు కాసు మహేష్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం పరామర్శించారు. ఆయనకు తగిలిన గాయాన్ని పరిశీలించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు కాసు కృష్ణారెడ్డితో కాసేపు ముచ్చటించి ఆయన యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మాజీ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు పదముత్తం చిట్టిబాబు, రొంపిచర్ల మాజీ కన్వీనర్ పచ్చవ రవి పాల్గొన్నారు.

ప్రారంభమైన రెడ్డిపేరంటాలమ్మ ప్రతిష్టా మహోత్సవాలు


ఏర్పాటు చేసిన కలశ ప్రతిష్ట


ఆలయ ప్రాంగణంలో పూజలు నిర్వహిస్తున్న రుత్విక్కులు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన శ్రీ రెడ్డి పేరంటాలమ్మ తల్లి, నాగలింగేశ్వరస్వామి వార్ల దేవస్థాన ప్రతిష్టా మహోత్సవం ఈ నెల 17న జరగనుంది. మూడు రోజుల పాటూ జరగనున్న ఉత్సవాల్లో భాగంగా తొలిరోజు శనివారం మంగళతోరణాలతో సర్వ దేవతా ఆహ్వానం, సుప్రభాత సేవ, ఉపనిషత్ పారాయణం, మహాగణపతి పూజ, పుణ్యావాచనం, రక్షాబంధనం, గోపూజ, యాగశాల ప్రవేశం, అఖండ ప్రతిష్ట, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం నిర్వహించారు. విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సోమవారం ఉదయం 10.41 గంటలకు సనాతన శంకరపీఠం వ్యవస్థాపక పీఠాధిపతి నెమ్మికంటి నరసయ్య ఆచార్య స్వామీజీ ఆధ్వర్యంలో ప్రతిష్ట నిర్వహించనున్నారు. కార్యక్రమాలను ఆలయ అర్చకులు కొండపర్తి పూర్ణాచార్యులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

డాక్టర్ భవనం ఆంజనేయరెడ్డి మృతి


ఆంజనేయరెడ్డి (ఫైల్)

నరసరావుపేట ఈస్ట్: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం విశ్రాంత పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ భవనం ఆంజనేయరెడ్డి శుక్రవారం కన్నుమూసారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో గుంటూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. డాక్టర్ ఆంజనేయరెడ్డి మృతి పట్ల వర్సిటీ వర్గాలు సంతాపం తెలిపాయి. నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామానికి చెందిన డాక్టర్ ఆంజనేయరెడ్డి ఏఎన్‌యూలో చిన్న ఉద్యోగిగా చేరి అంచెలంచెలుగా ఎదిగి వర్సిటీ పరీక్షల విభాగం అధికారిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన కుమారులు డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి ప్రముఖ న్యూరాలజిస్టుగా గుంటూరులో ప్రాక్టీస్ చేస్తుండగా చిన్న కుమారుడు డాక్టర్ నాగకిషోర్‌రెడ్డి జబల్‌పూర్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జొన్నలగడ్డలోని స్వగృహానికి తీసుకువచ్చిన ఆయన భౌతికకాయాన్ని వర్సిటీ అధికారులు, సిబ్బందితో పాటు పలువురు విద్యావేత్తలు, రాజకీయ నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

కే-రిడ్జి విద్యార్థులకు కేంద్ర ప్రతిభా పారితోషికం


విద్యార్థులతో పాఠశాల చైర్మన్ నాతాని, సిబ్బంది

నరసరావుపేట ఈస్ట్: గుంటూరురోడ్డులోని కే-రిడ్జి పాఠశాల విద్యార్థులు ఆల్ ఇండియా రేడియోలో ఆరు ఫారిన్ లాంగ్వేజ్‌లలో కార్యక్రమం నిర్వహించి కేంద్ర ప్రభుత్వ ప్రసార భారతి విభాగం ద్వారా ప్రతిభా పారితోషకాన్ని పొందటం అభినందనీయమని పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాల విద్యార్థులు ఇటీవల రేడియోలో ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, ఇంగ్లిష్, ఇటాలియన్, జపనీస్ భాషలతో కూడిన ప్రోగ్రామ్‌లో పాల్గొని ఆయా భాషలలో తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పారితోషకం అందుకున్న సందర్భంగా శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో చైర్మన్ నాతాని మాట్లాడుతూ విద్యార్థులకు విదేశీ భాషలలో శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేకంగా అంతర్జాతీయ ప్రమాణాలతో వాయిస్ రికార్డింగ్ స్టూడియోను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ప్రముఖ పోలిగ్లాట్ పూలబాలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ బర్నబాస్, క్యాంపస్ ఇన్‌ఛార్జ్ కోట.బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వద్దు బ్రో..


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐ చరణ్, అధ్యాపకులు, విద్యార్థులు

నరసరావుపేట టౌన్: మాదక ద్రవ్యాలను సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వన్‌టౌన్‌సీఐ ఎంవీ చరణ్ పిలుపునిచ్చారు. డ్రగ్స్ వద్దు బ్రో పేరుతో శనివారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కమ్యూనిటీ పెద్దలు కలసి యువతను సరైన మార్గంలో నడిపించాలన్నారు. డ్రగ్స్ వినియోగించిన, కలిగియున్నా కఠిన చర్యలు తప్పవన్నారు. పల్నాడు జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. మాదకద్రవ్యాలపై సమాచారం ఉంటే పోలీసు హెల్ప్‌లైన్ 100, 1972 ద్వారా సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచండి

బొల్లాపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల ప్రత్యేకాధికారి, ఏడీఏ బి. రవిబాబు తెలిపారు. మండలంలోని వెల్లటూరు గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. చెత్తసంపద కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మార్కెట్‌యార్డు గోడౌన్ ప్రదేశాలను సందర్శించి ఆ ప్రాంతాలను శుభ్రపరిచారు. అనంతరం సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించి మాట్లాడుతూ క్లాప్ మిత్రలు గ్రామంలోని తడి, పొడి చెత్తను సేకరించి చెత్తసంపద కేంద్రాలకు తరలించాలన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మైలా చిన్నవీరయ్య, గ్రామపెద్దలు, పలు శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసులమంటూ రీకవరి ఏజెంట్ బెదిరింపులు

నరసరావుపేట రూరల్: పోలీసులమంటూ రికవరి ఏజెంట్ ఖాతాదారుడిపై బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ ఆడియో శనివారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రూరల్ పోలీసులు విచారణ చేపట్టారు. రూరల్ పోలీస్‌స్టేషన్ నుంచి హెడ్‌కానిస్టేబుల్ మూర్తిని మాట్లాడుతున్నా అంటూ ఖాతాదారుడికి ఫోన్ వచ్చింది. ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో లోన్ పెండింగ్‌లో ఉందని దీనిపై రూరల్ స్టేషన్‌లో కేసు నమోదైందని తెలిపాడు. మేము ఎటువంటి లోన్ తీసుకోలేదని లబ్ధిదారుడు వివరించాడు. ఏదైనా ప్రొడక్ట్ కోసం మీ భార్య లోన్ తీసుకున్నట్టు ఆధార్, పాన్, బ్యాంక్ పాస్‌బుక్‌ల సహా డాక్యుమెంట్లు ఉన్నాయని, దీనిపై విచారణ చేస్తున్నామంటూ బెదిరింపులకు దిగాడు. దీంతో ఖాతాదారుడికి అనుమానం వచ్చి ఏ స్టేషన్ నుంచి మాట్లాడుతున్నారు అని అడగడంతో అసభ్య పదజాలంతో దూషణలకు దిగాడు. లోన్ చెల్లించకుంటే రిజల్ట్ ఎలా ఉంటుందో అరగంటలో చూపిస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై విచారణ జరుపుతున్నట్టు రూరల్ ఎస్ఐ కిశోర్ తెలిపాడు.

ముగ్గురు మహిళలకు గాయాలు

చిలకలూరిపేట టౌన్: శిల్పాలకు ఉపయోగించే రాయిని తరలిస్తున్న క్రమంలో ప్యాసింజర్ ఆటోను ఢీకొని ముగ్గురు మహిళలు గాయపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని పురుషోత్తమపట్నం ఊరి చివరన శిల్పాలు చెక్కే ప్రాంతంలో క్రేన్ సాయంతో భారీ రాయిని తరలిస్తుండగా అదే సమయంలో సంతమాగులూరు మండలం గొరిజవోలు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలతో వస్తున్న ప్యాసింజర్ ఆటోకు వెనుక వైపు ప్రమాదవశాత్తు రాయి తగిలింది. దీంతో ఆటో వెనుక భాగంలో కూర్చున్న ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గాయాలైన గుంటి రమాదేవి, వెంకటరత్నం, పెరుమళ్ల కోటేశ్వరమ్మ, అదే ఆటోలో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఆస్పత్రిలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పరీక్ష మెటీరియల్ పంపిణీ

నాదెండ్ల: చదువు విలువైన సంపద అని, ఉన్నత విద్యావంతులైతే పేదరికాన్ని జయించవచ్చని కనపర్ర జిల్లా పరిషత్ హైస్కూలు సీనియర్ సోషల్ ఉపాధ్యాయుడు సీహెచ్ సుబ్బారావు చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల జెడ్పీ హైస్కూలులో పదో తరగతి చదివే విద్యార్థులకు కెరియర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సామగ్రి అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నిర్మల, ఉపాధ్యాయులు కెల్లంపల్లి రెడ్డియ్యచౌదరి, శ్రీనివాసరావు, దుర్గాదేవి ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి ఆర్థిక సహాయం


చెక్కులను అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: బొల్లాపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ తన సొంత సోదరి కృష్ణవేణి చేతిలో హత్యకు గురైన తలపల గోపీకృష్ణ కుటుంబానికి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు రూ. 2.35 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గోపీకృష్ణ భార్య హిమబిందుకు బ్యాచ్ కానిస్టేబుళ్లు అందజేసిన రూ.1.35 లక్షలతో పాటు పోలీసు శాఖ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున మరో రూ.1 లక్ష చెక్కును అందజేశారు. పోలీసు శాఖపరంగా రావల్సిన అన్నీ ప్రయోజనాలు కల్పిస్తామని వారికి ఎస్పీ భరోసా ఇచ్చారు. పరిపాలన విభాగ అదనపు ఎస్పీ జేవీ సంతోష్, అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు, ఎ.శ్రీనివాస్, వల్లభరావు పాల్గొన్నారు.

జాబ్ మేళాకు హాజరుకావాలి

చిలకలూరిపేట: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాగన్నపాలెం కమ్యూనిటీ హాలులో ఈ నెల 18న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ తమ్మాజీరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో జయలక్ష్మి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్నోవ్ సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, వసంత టెక్స్‌టైల్స్ వంటి పలు కంపెనీలు హాజరౌతాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9100566581, 7330698119 నంబర్లను సంప్రదించాలన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

వినుకొండ : పట్టణంలోని విద్యానగర్ గిరిజన బాలికల హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థినీలకు మానవ సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్షా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షులు పీవీ సురేష్‌బాబు మాట్లాడుతూ పరీక్షలు బాగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. కార్యక్రమంలోసెక్రటరీ చామర్తి భవానిశంకర్, కౌన్సిలర్ పోలూరి అంజలీదేవి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు భాగవతుల రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్, ప్రిన్సిపాల్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

వినుకొండ : కళాకారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని స్థానిక తహసీల్దార్ సురేష్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వినుకొండ మండలంలో 100 మంది కళాకారుల కుటుంబాలు ఉన్నాయని, వారందరికీ నివాస గృహాలు లేక, అద్దెలు చెల్లించకలేక ఇబ్బందులు పడుతున్నారని, వారిని ఆదుకోవాలన్నారు. కళా ప్రదర్శనలకు అవకాశం కల్పించాలని, పెన్షన్ వచ్చేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కల్తీలు, తూకాలతో అప్రమత్తంగా ఉండాలి

ఆర్‌డీవో కె.మధులత


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్‌డీవో మధులత, పలు శాఖల అధికారులు

నరసరావుపేట రూరల్: నేటి సమాజంలో జరుగుతున్న కల్తీలు, తూకాలమోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డీవో కె.మధులత తెలిపారు. ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని శంకరభారతీపురం జెడ్పీహైస్కూల్‌లో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌డీవో మధులత, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ అల్లూరయ్య, పౌరసరఫరా డిప్యూటి తహసీల్దార్లు యం.సత్యనారాయణ, కె.వి.శ్రీనివాస్, విద్యాసాగర్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్‌డీవో మాట్లాడుతూ కల్తీల విషయంలో వినియోగదారులు జాగ్రత్తల వహించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. తూకం, ఆన్‌లైన్ పేమెంట్, ఓటీపీలను ఉపయోగించే సమయంలో తగినంత జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పిల్లలు తీసుకునే చిరుతిండ్లులో జరిగే రంగుల కల్తీని తెలియజేశారు. కల్తీ టీ పొడి గుర్తించడం, టెస్టింగ్ సాల్ట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనంతరం వ్యాసరచన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి, వినియోగదారుల సంఘాల ప్రతినిధులు పి.యజ్ఞ నారాయణ, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్, స్కౌట్స్ టీచర్ వెంకటరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు పోస్టర్లను ఆవిష్కరించారు.

ఉపాధ్యాయినులు.. తల్లిదండ్రుల పాత్ర పోషించాలి

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల కార్యదర్శి డి.దేవానందరెడ్డి


కేజీబీవీ ప్రిన్సిపల్స్‌ను అభినందిస్తున్న దేవానందరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థినిలను తమ కన్నబిడ్డల్లా భావించి ఉపాధ్యాయినులు తల్లిదండ్రుల పాత్రను పోషించాలని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల కార్యదర్శి డి.దేవానందరెడ్డి తెలిపారు. పెదచెరువులోని కేజీబీవీ పాఠశాలలో శనివారం మానసిక ఆరోగ్యం– బాలికల స్థిరాభివృద్ధికి మార్గం అనే అంశంపై జిల్లాలోని 24 కేజీబీవీ పాఠశాలల ప్రిన్సిపల్స్, పీఈటీలు, ఏఎన్ఎంలకు ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న దేవానందరెడ్డి మాట్లాడుతూ, ఉపాధ్యాయినుల సమన్వయంతో బాలికల అభ్యున్నతికి పాటుపడాలని తెలిపారు. జిల్లాకు ఐదుగురు చొప్పున కెరియర్, మానసిక ఆరోగ్య కౌన్సిలర్‌లను నియమించామన్నారు. వారి సహకారంతో పాఠశాలల్లో బాలికలకు మానసిక వత్తిడి నియంత్రణకు కౌన్సెలింగ్ నిర్వహించాలని తెలిపారు. ఈనెల 17వతేదీ నుంచి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ అధికారి టి.వి.సుబ్బారావు, జిల్లా బాలికా అభివృద్ధి అధికారి డి.రేవతి, మానసిక ఆరోగ్య కౌన్సిలర్లు జె.అశోక్, కె.ప్రేమ్‌కుమార్, ఎ.శాంతివర్ధన్, యూసఫ్ షరీఫ్, సిహెచ్.ఫణీంద్రకుమార్ పాల్గొన్నారు.

వర్గీకరణ పేరుతో దళితులను విభజించవద్దు

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్



నరసరావుపేట: ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులను విభజిస్తూ రాజ్యాంగంలో కల్పించిన రిజర్వేషన్ ఫలాలను విభజించే హక్కు రాష్ట్ర ప్రభుత్వాలకు లేదని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గోదా జాన్‌పాల్ పేర్కొన్నారు. శనివారం పల్నాడు జిల్లా నరసరావుపేట లోని మాలమహానాడు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్‌లో చట్టం చేయకుండా, గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఖాతరు చేయకుండా, ఎంపారికల్ డేటా సేకరించకుండా వర్గీకరణ పేరుతో దళితులను విభజిస్తే కూటమి ప్రభుత్వానికి తిప్పలు తప్పవని హెచ్చరించారు. 2004లో రాష్ట్ర ప్రభుత్వాలకు వర్గీకరణ చేసే అధికారం లేదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. ఎస్సీల జనాభా లెక్కలు తేల్చకుండా, పెరిగిన జనాభా ప్రకారం పెంచకుండా ఉన్న రిజర్వేషన్లు విభజించి పరిపాలించే సిద్ధాంతాన్ని రాష్ట్ర ప్రభుత్వం మానుకోకపోతే ఎన్నో ఇబ్బందులను కూటమి ప్రభుత్వం ఎదురుకోవాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం సుమారు 70 లక్షలు ఉన్న మాలలను సోషల్ మీడియాలో కేవలం 40 లక్షలుగా చూపిస్తూ 15 శాతం రిజర్వేషన్‌లో మాలలకు 7.5 శాతంగా వస్తున్న వాటిని తిప్పికొట్టే దిశగా ప్రభుత్వం పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ జోలికొస్తే వాటి అంతానికి మాలలు పంతంతో పనిచేస్తాయని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు


విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి

రొంపిచర్ల: మండలంలో ఆరేపల్లి గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జాతీయ ఆయోడిన్ లోపాల రుగ్మతల నిర్మూలన' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామని వైద్యాధికారి డాక్టర్ జగన్ నరసింహారెడ్డి అన్నారు. పాఠశాలలో 90 మంది విద్యార్థులకు జలుబు, దగ్గు, జ్వరం వంటి సాధారణ జబ్బులకు వైద్య పరీక్షల నిర్వహించారు. విద్యార్థులకు ఆరోగ్యం పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. అదే విధంగా రోజువారీ వాడే ఉప్పు, ఆయోడిన్ లోపాలు వలన కలిగే అనర్థాలు గురించి, థైరాయిడ్ గ్రంథి వలన కలిగే ఇబ్బందులు గురించి వివరించి, అవి రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజరాజేశ్వరీ, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, ఆశ కార్యర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.